సాక్షి
నిర్మల్
శుక్రవారం । 7 । జూలై । 2023



ఆపరేషన్‌కు అండగా నిలిచిన సాక్షి

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి.. అచేతన స్థితిలో 18 నెలలు మంచానికే పరిమితమైన వ్యక్తికి సాక్షి అండగా నిలిచింది. సాక్షిలో కథనంతో దాతలు ఆర్థికసాయం చేశారు. 8లో▸



నర్సరీల్లో పండ్ల మొక్కలు!

ఉద్యానవన నర్సరీలకు పూర్వవైభవం సంతరించేలా ఐటీడీఏ అధికారులు దృష్టి సారించా రు. ఉమ్మడి జిల్లాలోని నాలుగు నర్సరీల్లో మొక్కలు పెంచి రైతులకు సబ్సిడీపై అందిస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
30.3 /24.4

వాతావరణం

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం చల్లబడుతుంది. రుతుపవనాలు, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో చాలాచోట్ల వర్షం పడే అవకాశం ఉంది.

సీఎంఆర్ 4 శాతమే..!



భైంసా మండలంలోని రైస్‌మిల్లులో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ విశ్వంభర్

- ఖరీఫ్ 2022–23కు అప్పగించింది 159 ఏసీకేలు మాత్రమే..
- రైస్‌మిల్లర్ల జాప్యంపై కలెక్టర్ సీరియస్
- జిల్లావ్యాప్తంగా తహసీల్దార్లతో తనిఖీలు
- రోజుకు 56 ఏసీకేలు అప్పగించాలని మిల్లర్లకు టార్గెట్

జిల్లాలోని రైస్ మిల్లులు : 60
ఖరీఫ్ 2022–23 కేటాయించిన ధాన్యం : 1,68,177 మె.టన్నులు
అప్పగించాల్సిన బియ్యం : 3,885 ఏసీకేలు
అప్పగించిన బియ్యం : 159 ఏసీకేలు

భైంసాటౌన్: ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఎఫ్‌సీఐకి అప్పగించడంలో జిల్లా రైస్ మిల్లర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. 2022–23 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు 159 ఏసీకే(ఒక ఏసీకేకు 290 క్వింటాళ్లు)ల బియ్యం మాత్రమే ఎఫ్‌సీఐకి అప్పగించారు. ఈ లెక్కన ఇప్పటివరకు కేవలం 4 శాతం మాత్రమే సీఎంఆర్ పూర్తయినట్లు తెలుస్తోంది. సీఎంఆర్‌లో జాప్యంపై కలెక్టర్ వరుణ్‌రెడ్డి దృష్టి సారించారు. ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షలో సెప్టెంబర్ 30లోగా సీఎంఆర్ వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో కలెక్టర్ వరుణ్‌రెడ్డి జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల వారీగా తహసీల్దార్లతో రైస్‌మిల్లుల్లో గురువారం తనిఖీలు చేయించారు. ఒక్కో తహసీల్దార్ మూడు చొప్పున మిల్లులు తనిఖీ చేసి అప్పగించిన ధాన్యం, అప్పగించిన బియ్యం, నిల్వ ధాన్యం వివరాలు సేకరించాలని సూచించారు. మిల్లుల సామర్థ్యం మేరకు మిల్లింగ్ చేస్తున్నారా.. రోజుకు ఎన్ని ఏసీకేల బియ్యం అప్పగిస్తున్నారు.. వంటి వివరాలు సేకరించాలని, జాప్యం చేస్తున్న రైస్‌మిల్లులను గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఎంఆర్‌లో విఫలమైనా, ధాన్యం నిల్వలు లేకున్నా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

రోజుకు 56 ఏసీకేలు...

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో 60 రైస్ మిల్లులకు అధికారులు 1,68,177 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించారు. ఇందుకుగాను రైస్‌మిల్లర్లు 3,885 ఏసీకేల(11,26,650 క్వింటాళ్లు) బియ్యం ఎఫ్‌సీఐకి అప్పగించాలి. ఈనెల 3వ తేదీ నాటికి 159 ఏసీకేలు(46,110 క్వింటాళ్లు) మాత్రమే అప్పగించారు. సెప్టెంబర్ 30లోగా వందశాతం సీఎంఆర్ పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో కలెక్టర్ వరుణ్‌రెడ్డి జిల్లాలో సీఎంఆర్‌పై దృష్టి పెట్టారు. ఈ మేరకు నిర్ణీత గడువులోగా లక్ష్యం చేరుకునేలా మిల్లర్లకు టార్గెట్ విధించారు. రోజుకు 56 ఏసీకేల బియ్యం అప్పగించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

గడువులోపు కష్టమే..

ఇదిలా ఉండగా, ఖరీఫ్ 2022–23కు సంబంధించి నిర్ణీత గడువులోగా వందశాతం సీఎంఆర్ చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు కనీసం రెండంకెల లక్ష్యం కూడా చేరని మిల్లర్లు, మూడు నెలల్లో వందశాతం లక్ష్యం చేరుకోవడం కష్టమే. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా పలువురు మిల్లర్లు ప్రభుత్వం కేటాయించిన ధాన్యం పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్నారన్న విమర్శలున్నాయి. బ్లాక్‌లో రేషన్‌బియ్యం కొనుగోలు చేసి వాటినే రీసైక్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి అప్పగించారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో చాలా మిల్లుల్లో ధాన్యం నిల్వలపై సందేహాలు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో మార్కెట్‌లో దొడ్డిదారిన వెళ్లిన బియ్యం అమ్మకానికి రాకపోవడం, ధరలు పెరిగిపోవడంతో ఎఫ్‌సీఐకి బియ్యం ఎలా అప్పగించాలని తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది.

కుమురంభీం ఆశయం మేరకే పోడు పట్టాలు



సారంగాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, పక్కన కలెక్టర్ వరుణ్‌రెడ్డి



నృత్యం చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి



మామడలో హక్కు పత్రాలు అందిస్తున్న మంత్రి

- తండాలకు పంచాయతీలుగా గుర్తింపు
- అన్ని గిరిజన గ్రామాలకు పక్కా రోడ్లు
- అటవీ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- మామడ, సారంగాపూర్‌లో గిరిజనులకు పోడు పట్టాల పంపిణీ

మామడ/సారంగాపూర్: ఆదివాసీ పోరాట యోధుడు.. జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన కుమురంభీం ఆశయాన్ని రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తుందని అటవీ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. భీం ఆకాంక్ష మేరకే ఆదివాసీలకు పోడు పట్టాలు ఇస్తున్నట్లు తెలిపారు. మామడ మండల కేంద్రంలో, సారంగాపూర్ మార్కెట్ యార్డు ఆవరణలో గిరిజనులకు గురువారం వేర్వేరుగా పోడు పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గిరిజనులు అడవితల్లిని నమ్ముకుని పోడు వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతూ పడుతున్న కష్టాలను చూడలేకనే సీఎం కేసీఆర్ పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని నిర్ణయించారన్నారు. ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కుమురంభీం త్యాగాలకు గుర్తుగానే ఆసిఫాబాద్ జిల్లాకు ఆయన పేరు పెట్టినట్లు తెలిపారు. పోడు భూములు సాగుచేసిన గిరిజనులపై నమోదు చేసిన కేసులు ఉపసంహరించుకునేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. తండాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసిందన్నారు. గిరిజన గ్రామాలలో ప్రత్యేక నిధులతో రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గిరిజనులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచామని తెలిపారు. జిల్లా కేంద్రంలో సేవాలాల్ ఆలయం నిర్మిస్తున్నామని చెప్పారు. సారంగాపూర్ మండలం రవీంద్రనగర్ గ్రామ ప్రజల కోరిక మేరకు వారికి పంపిణీ చేసిన పోడు భూముల్లో సాగుపనులను ప్రారంభించడానికి మంత్రిని ఆహ్వానించారు. వారి ఆహ్వానం మేరకు అక్కడికి వెళ్లిన మంత్రి భూమి దుక్కి దున్ని విత్తనం వేశారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 1,152 మంది లబ్ధిదారులకు 3,061 ఎకరాలకు సంబంధించిన పోడు పట్టాలతోపాటు రైతుబంధు అందుతుందని తెలిపారు. సారంగాపూర్ మండలంలో 734మంది రైతులకు 3,784 ఎకరాలకు సంబంధించి పోడు పట్టాలను పంపిణీ చేశామన్నారు. పోడు పట్టాల పంపిణీకి ముందే లబ్ధిదారుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమయ్యాయని తెలిపారు. గిరివికాస్ పథకంలో భాగంగా సాగు కోసం త్రీఫేజ్ విద్యుత్‌ను అందించడం, బోర్‌వెల్ వేయించి ఇస్తామని పేర్కొన్నారు. మళ్లీ అడవులను నరికివేయడం చేస్తే అటవీశాఖ అధికారులు చూస్తూ ఊరుకోరని అన్నారు. కార్యక్రమాల్లో జెడ్పీ సీఈవో సుధీర్, ఆర్డీవో స్రవంతి, మాజీ డీసీసీబీ చైర్మన్ కొరిపెల్లి రాంకిషన్‌రెడ్డి, వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, డీటీడీవో అంబాజీ, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్ల వెంకట్రామిరెడ్డి, సారంగాపూర్ ఎంపీపీ మహిపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ పద్మ, సర్పంచులు హన్మాగౌడ్, సుజాత, రాందాస్, అరవింద్‌రావ్, మామడ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, మామడ తహసీల్దార్ అరిఫా, ఎంపీడీవోలు శేఖర్, రమేష్, ఎఫ్ఆర్‌వోలు అవినాష్, పుండలీక్, జైపాల్‌రెడ్డి, ఏవో నాగరాజు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఆయిటి చందు, మాధవరావు, మాణిక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పోలింగ్ ప్రక్రియపై అవగాహన



మాక్ పోల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గురువారం మాక్ పోల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జూన్ 22 నుంచి జూలై 04 వరకు 13 రోజులపాటు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి స్థాయి చెకింగ్ జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈసీఐఎల్ ఇంజనీర్లు, ఎన్నికల సిబ్బంది సమక్షంలో పూర్తి పారదర్శకంగా నిర్వహించామన్నారు. 918 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఈవీఎం, వీవీప్యాట్‌ల చెకింగ్‌లో 10 మంది ఇంజినీర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారని వివరించారు. రాజకీయ పార్టీలు పోలింగ్ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని ఈవీఎం, వీవీప్యాట్‌లపై మాక్‌పోల్ ఏర్పాటు చేశామన్నారు. ఆర్డీవో స్రవంతి, తహసీల్దార్లు సుభాష్ చందర్, అనిరుధ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతి నిధులు రమేశ్, గంగ్రత్ రమేశ్, అంబాడి రాకేశ్, సయ్యద్ మజార్, కె.శ్రావణ్‌రెడ్డి, ఎస్ఎస్.రెడ్డి పాల్గొన్నారు.

వారానికి రెండు రోజులు డ్రైడే

- డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్వో

నిర్మల్‌చైన్‌గేట్: వానాకాలం వచ్చే వ్యాధులు నివారించేందుకు వారంలో రెండు రోజులు మంగళవారం, శుక్రవారం డ్రైడే పాటించాలని జిల్లా వైద్యాధికారి ధనరాజ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సహాయకులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలను తొలగించాలని, పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాలతో నీరు నిలిచి దోమలు వృద్ధి చెంది వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. వ్యాధుల నియంత్రణకు గ్రామాల వారీగా ప్రణాళిక తయారుచేసి అమలు చేయాలన్నారు. ప్రజలకు టెలీకన్సల్టెన్సీ గురించి అవగాహన కలిగించి సేవలు వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. అసంక్రమిత వ్యాధులను నివారించడానికి, నియంత్రించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి రవీందర్, సామాజిక ఆరోగ్య అధికారి గిరిబాబు, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్, సుధాకర్, ఆరోగ్య పర్యావేక్షకురాలు విమల, ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

సాయిప్రసాద్‌కు సన్మానం



సాయిప్రసాద్‌ను సత్కరిస్తున్న సత్యనారాయణగౌడ్

నిర్మల్‌చైన్‌గేట్: ఎవరెస్ట్ శిఖరం బేస్ క్యాంప్ వరకు పర్వతారోహణ చేసిన నిర్మల్ పట్టణానికి చెందిన చార్టెడ్ అకౌంటెంట్ సాయిప్రసాద్‌ని బీఆర్ఎస్ నాయకులు, వశిష్ఠ విద్యా సంస్థల అధ్యక్షుడు వి.సత్యనారాయణగౌడ్ గురువారం సన్మానించారు. వశిష్ఠ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువా, మెమెంటోతో సన్మానించారు. ఎవరెస్ట్ శిఖర అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ రమేశ్, ప్రిన్సిపాల్ డాక్టర్ అఖిలేష్ కుమార్ సింగ్, రమణగౌడ్ పాల్గొన్నారు.

సమ్మెలో పంచాయతీ కార్మికులు

- గ్రామాల్లో విధులు బహిష్కరణ
- జిల్లాలో 1,475 మంది కార్మికులు
- పారిశుధ్య నిర్వహణ, ఇతర పనులపై ప్రభావం



దిలావర్‌పూర్‌లో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామాల్లో పారిశుధ్య పనులతోపాటు ఇతర విధులు నిర్వర్తించే పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె బాటపట్టారు. ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, అర్హులకు ఉద్యోగోన్నతి కల్పించాలనే డిమాండ్లతో గురువారం నుంచి సమ్మెకు దిగారు. తమ డిమాండ్లను పలుమార్లు అటు ప్రభుత్వం, ఇటు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేకపోవడంతో సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని వారు చెబుతున్నారు.

కీలకమైన పనుల్లో...

జిల్లాలో 396 జీపీల్లో 1,475 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. పెద్ద జీపీల్లో పది నుంచి 15 మంది, చిన్న జీపీల్లో నలుగురు నుంచి ఆరుగురు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిని మల్టీపర్పస్ వర్కర్లుగా పిలుస్తుండగా, చెత్తాచెదారం తొలగింపు, డ్రెయినేజీల నిర్వహణ, హరితహారం మొక్కలు, ప్రభుత్వ పాఠశాల పరిశుభ్రత, ఇంటింటికి చెత్త సేకరణ, విద్యుద్దీపాలు, తాగునీటి సరఫరా, ఇంటి పన్నుల వసూలు వంటి విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ప్రభుత్వం రూ.9,500 చొప్పున, మేజర్ పంచాయతీల్లో రూ.12 వేల చొప్పున చెల్లిస్తున్నారు. ఇక ట్రాక్టర్ల డ్రైవర్లు కూడా తమతోనే పని చేయిస్తుండడం, విద్యుత్ లైట్ల మరమ్మతు పనులతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. గతంలో సమ్మె చేసిన సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్నారు. పంచాయతీ కార్మికుల సమ్మెతో చాలా గ్రామాల్లో పనులు నిలిచిపోయాయి.

డిమాండ్లు ఇవీ..

- కార్మికులు, సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి.
- ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలి
- పీఆర్సీలో నిర్ణయించిన ప్రకారం నెలకు రూ.19 వేల వేతనం చెల్లించాలి
- కారోబార్, బిల్ కలెక్టర్‌ను సహాయ కార్యదర్శులుగా నియమించాలి
- జీవో 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి
- విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వాలి.
- కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలి.
- ఆదాయ వనరులున్న గ్రామ పంచాయతీల్లో వేతనాలు పెంచడానికి అనుమతి ఇవ్వాలి.
- 8 గంటల పనిదినాలు అమలు చేయాలి.
- పండుగ సెలవులు, వారాంతపు సెలవు, ఆర్జిత సెలవులు అమలు చేయాలి.
- కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి.

హామీలు నిలబెట్టుకోవాలి..



ఏళ్ల తరబడి వెట్టిచాకిరీ చేస్తూ దుర్భర జీవితాలు గడుపుతున్నాం. కనీస వేతనం కావాలంటే ప్రభుత్వం రూ. వెయ్యి పెంచి చేతులు దులుపుకుంది. గత నెలలో చేపట్టాల్సిన నిరవధిక సమ్మెను ప్రభుత్వం స్పందిస్తుందనే ఆశతోనే నెల రోజులు వాయిదా వేసుకున్నాం. నెల గడిచినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా సమ్మెకు దిగాం. 2018లో చేపట్టిన నిరవధిక సమ్మెకాలంలో సీఎం కేసీఆర్ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

– నరపకా నర్సయ్య, పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు

పేదలకు అండగా కేంద్రం



ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని, బీజేపీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో 5వరోజు గురువారం వెంకటాద్రిపేట్, బ్రహ్మపూరి, సోమర్‌పేట్, రామమందిర్‌వీధి వార్డులలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక పథకాలను చిట్టచివరి నిరుపేద కుటుంబాలకు అందే విధంగా చూస్తామన్నారు, ఎక్కడా అవినీతికి తావు లేకుండా ప్రతీ వ్యక్తికి జన్‌ధన్ అకౌంట్, ఉజ్వల యోజన ద్వారా ఉచిత సిలిండర్ల పంపిణీ, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా 36 కోట్ల మంది లబ్ధిదారులకు రూ 1.32 లక్షల కోట్ల పంపిణీ, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, మహిళా సాధికారికత కోసం స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా రూ 11. 76 కోట్ల టాయిలెట్ల నిర్మాణం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా 3 కోట్ల పైన పట్టణ మరియు గ్రామీణ గృహాల నిర్మాణం, సౌభాగ్య పథకం ద్వారా 2.88 కోట్ల ఇళ్లకు విద్యుదీకరణ, పీఎం స్వనిధి ద్వారా 48.2 లక్షల మందికి వీధి వ్యాపారులకు రుణాలు అందించడం జరిగిందని వివరించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కేంద్రంతోపాటు ఇటు రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పాటు చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సాదం అరవింద్, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రామ్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసెమ్మె రాజు, జిల్లా ఉపాధ్యక్షులు కమల్ నయన్, అలివేలు మంగ, జిల్లా కార్యదర్శులు గాదె విలాస్, కోరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రజిని వైద్య తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికుడి పట్టివేత

- యజమానికిరూ.15 వేల జరిమానా



మాట్లాడుతున్న జిల్లా బాలల సంక్షేమ సమితి అధికారులు..

నిర్మల్ ఖిల్లా: 14 ఏళ్లలోపు బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని రెస్క్యూటీం ఎస్సై రమణారెడ్డి, సహాయ కార్మిక శాఖ అధికారి సాయిబాబా హెచ్చరించారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జిల్లా పోలీస్ విభాగం ఆధ్వర్యంలో పలు కాలనీల్లో గురువారం తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన వలస కార్మికుల వెంట పెయింటింగ్ పనులు చేస్తున్న 12 ఏళ్ల బాలుడిని పట్టుకున్నారు. ఈ బాలుడితో పని చేయిస్తున్న యజమాని ఇమ్రాన్‌కు రూ.15 వేల జరిమానా విధించారు. అనంతరం బాలుడికి జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు స్వదేశ్‌పరికిపండ్ల, సైమన్ సుందర్, జన్ను అనిల్, నల్ల సరిత బృందం కౌన్సెలింగ్ నిర్వహించారు. బాలుడి స్వస్థలమైన ఉత్తరప్రదేశ్‌లోని తల్లిదండ్రుల వద్దకు పంపే ఏర్పాట్లు చేయాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి దేవి మురళిని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు మాట్లాడుతూ.. 14 ఏళ్లలోపు బాలలను ఎట్టి పరిస్థితిలో పనుల్లో పెట్టుకోవద్దన్నారు. ప్రమాదకరమైన పనులు వారితో చేయిస్తే బాల కార్మిక నిషేధ చట్టం 1986 ప్రకారం కార్మికశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది షౌకత్, చిన్నయ్య, వజ్రమ్మ, నరేశ్, జిల్లా బాలల సంరక్షణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల నియామకానికి 10న ఇంటర్వ్యూ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పరిధిలోని ఖానాపూర్, భైంసా బస్తీ దవాఖానాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్యాధికారిగా పని చేయుటకు ఈనెల 10న సోమవారం ఇంటర్వ్యూ నిర్వహిస్తామని డీఎంహెచ్‌వో ధనరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీబీఎస్ విద్యార్హత కలిగి, తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ కలిగిన వైద్యులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఉదయం 11 గంటలకు నేరుగా ఇంటర్వ్యూకు రావాలని సూచించారు.

ఊరటనిచ్చిన వాన



వర్షంతో జలమయమైన ప్రధాన రహదారి



శివాజీ చౌక్‌లో రోడ్లపై పారుతున్న వరద



జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం 7 గంటల తర్వాత ప్రారంభమైన వర్షం ఏకబిగిన కురిసింది. రాత్రి 11 గంటల వరకు జిల్లా కేంద్రంలో వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. జిల్లా కేంద్రంలోని పలు కాలనీలో రోడ్లు నీటితో నిండిపోయాయి, డ్రైనేజీలు పొంగిపొర్లాయి. పనులకు వెళ్లి ఇళ్లకు వస్తున్నవారు ఇబ్బందిపడ్డారు. వాన కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఈ వాన ఊరటనిచ్చింది. – నిర్మల్‌ఖిల్లా

క్లుప్తంగా

గుడుంబా స్థావరాలపై దాడులు



పట్టుకున్న పటికతో ఎక్సైజ్ అధికారులు

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్‌లో గురువారం ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 2 క్వింటాళ్ల పటికను పట్టుకున్నారు. 500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవి తెలిపారు. గ్రామంలోని ఓ పాడుబడిన ఇంట్లో రహస్యంగా దాచి ఉంచిన వాటిని స్వాధీనం చేసుకుని మూడు కేసులు నమోదు చేశామన్నారు. బంక భూమన్నపై కేసు నమోదు చేయడంతో పాటు తహసీల్దార్ కార్యాలయంలో ఉపతహసీల్దార్ మంజుల ఎదుట బైండోవర్ చేశామన్నారు.

ఒకరిపై పోక్సో కేసు

ఖానాపూర్: బాలికను వేధించిన మధ్యప్రదేశ్‌కు చెందిన చాంద్‌కుమార్ మారావిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి బుధవారం రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని పాత తర్లపాడ్ గ్రామశివారులో గల సిమెంట్ ఇటుక బట్టీలో మహారాష్ట్రకు చెందిన ఓ కుటుంబం పనిచేస్తుందని తెలిపారు. వారి కూతుర్ని అక్కడే పనిచేస్తున్న వ్యక్తి లైంగికంగా వేధిస్తున్నాడన్నారు. నిర్మల్ డీఎస్పీ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు



గాయాలు చూపిస్తున్న చిన్నారి

ముథోల్: మండల కేంద్రంలో గురువారం కుక్కలు చిన్నారులపై దాడిచేసి గాయపరిచాయి. నయాబాదికి చెందిన జుబేదా, పర్వీన్, ఇర్ఫాన్ ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కల గుంపు వారిపై దాడి చేసింది. గమనించిన వృద్ధురాలు హైమద్‌బీ వాటిని తరిమేందుకు ప్రయత్నించగా ఆమెపై కూడా దాడి చేశాయి. పట్టణంలోని పలు వీధుల్లో కుక్కలు గుంపుగుంపులుగా తిరుగుతూ చిన్నారులు, వృద్ధులపై దాడులకు పాల్పడుతుండడంతో బయటకు వెళ్లేందుకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కుక్కల బెడదను నివారించేందుకు అధికార యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

కుభీర్(ముథోల్): మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తా వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మకు తగిలి ఖదం రమాకాంత్‌కు చెందిన మేక మృతి చెందింది. మేక విలువ 16 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రమాకాంత్ కోరుతున్నాడు.

ఐటీడీఏ నర్సరీల్లో పండ్ల మొక్కలు!



ఉట్నూర్ నర్సరీలో పెంచుతున్న మునగ మొక్కలు

- పూర్వ వైభవం సంతరించుకుంటున్న ఉద్యాన నర్సరీలు
- ఉమ్మడి జిల్లాలో నాలుగు చోట్ల ఏర్పాటు
- అందుబాటులో కొబ్బరి, మునగ, మామిడి మొక్కలు
- రైతుల ఆర్థికాభివృద్ధికి అధికారుల ప్రత్యేక చర్యలు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఉద్యాన వన నర్సరీలకు పూర్వవైభవం సంతరించేలా ఐటీడీఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నెల రోజుల క్రితం ఐటీడీఏ ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన సందీప్‌కుమార్ రైతుల మేలుకోసం కృషి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని నాలుగు నర్సరీల్లో కొబ్బరి, మామిడి, మునగ మొక్కలను పెంచి రైతులకు సబ్సిడీపై అందిస్తున్నారు. పీవీటీజీ రైతులకు ఉద్యాన నర్సరీలో వ్యవసాయం, కూరగాయల సాగు, పండ్ల తోటల్లో అంతర పంటగా కూరగాయల సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారు.

రైతులకు అందుబాటులో మొక్కలు

ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి, భీమారం, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జంబుగాలో నర్సరీలు కొనసాగుతున్నాయి. రైతులకు నాణ్యమైన మొక్కలు అందించడమే లక్ష్యంగా ఆయా నర్సరీల్లో కొబ్బరి, మామిడి, మునగ మొక్కలు అందుబాటులో ఉంచారు. ఉట్నూర్ నర్సరీలో 10 వేల కొబ్బరి మొక్కలు అందుబాటులో ఉంచగా ఇప్పటికే 5,500 మొక్కల విక్రయాలు జరగాయి. ఈ నాణ్యమైన మొక్కల ద్వారా కొబ్బరి బొండాలతో పాటు ఎండు కొబ్బరితో రైతులకు రెండు రకాల ఆదాయం చేకూరుతుంది. ఈ ఏడాది బెల్లంపల్లి, భీమారం, జంబుగాలో 25 వేల మామిడి మొక్కలు, 25 వేల మునగ మొక్కలు రైతులకు అందుబాటులోకి తేనున్నారు. మునగ మొక్కలు మరో 10 రోజుల్లో, మామిడి మొక్కలు 6 నెలల్లో విక్రయానికి సిద్ధం కానున్నాయి. సిద్ధంగా ఉన్న కొబ్బరి మొక్కలు ఇప్పటికే విక్రయాలు జరిగాయి. మునగ మొక్కలు నాణ్యమైనవి కావడంతో తక్కువ సమయంలో కాయలు చేతికి వస్తాయి. రైతులు విక్రయించేందుకు ఎంతో దోహదపడనుంది. బయట మార్కెట్ కంటే ఐటీడీఏ నర్సరీల్లో తక్కువ ధరకే కొబ్బరి మొక్క రూ.50, మామిడి మొక్క రూ.45, మునగ మొక్క రూ.20 చొప్పున అందించనున్నారు. అంతే కాకుండా నీటి వసతి కలిగిన రైతులకు కూరగాయల విత్తనాలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నారు.



ఉట్నూర్ నర్సరీలో కొబ్బరి మొక్కలు



ఉట్నూర్ నర్సరీలో పెంచుతున్న మామిడి మొక్కలు

ఆసక్తి కనబరుస్తున్నారు



ఏజెన్సీ ప్రాంతంలోని రైతులు పంటల సాగుతో ఆర్థికంగా ఎదిగేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం. హార్టికల్చర్‌లలో నాణ్యమైన విత్తనాలు, కూరగాయలు, పండ్ల తోటల ఏర్పాటు, పండ్ల మొక్కలు అందుబాటులో ఉంచుతున్నాం. మొక్కలు నాటే విధానం, మెలకువలు, తక్కువ సమయంలో లాభదాయకంగా పండించే పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– సందీప్‌కుమార్, ఐటీడీఏ హార్టికల్చర్ అధికారి

ఆపరేషన్‌కు అండగా నిలిచిన 'సాక్షి'

- రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి..
- 18 నెలలుగా మంచం పట్టిన మల్లేశ్
- 'సాక్షి' కథనంతో స్పందించిన దాతలు
- నిర్మల్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో ఆపరేషన్



నిర్మల్‌లోని ఆస్పత్రిలో ఆపరేషన్ పూర్తి చేసుకున్న మల్లేశ్

సాక్షి స్పందన

కడెం(ఖానాపూర్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి.. అచేతనస్థితిలో 18 నెలల పాటు మంచం పట్టిన కడెం మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామానికి చెందిన నాంపెల్లి మల్లేశ్ దీనగాథను మే 20న, 'నా కొడుకును కాపాడండి' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి దాతలు స్పందించారు. ఈనెల 5న నిర్మల్ జిల్లా కేంద్రంలోని దేవేందర్‌రెడ్డి ఆస్పత్రిలో బాధితుడికి ఆపరేషన్ పూర్తి చేశారు.

దాతలు స్పందించారు..

కొత్త మద్దిపడగకు చెందిన రామవ్వ–లక్ష్మణ్ దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు మల్లేశ్‌కు లక్ష్మీసాగర్‌కు చెందిన యువతితో వివాహమైంది. దంపతులకు రెండేళ్ల కుమారుడు సంతానం. 2021 డిసెంబర్‌లో ధర్మాజీపేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వెన్నుపూస దెబ్బతింది. ఉస్మానియా, నిమ్స్, రిమ్స్ తదితర ఆస్పత్రులు తిరిగి సుమారు రూ.లక్ష వరకు ఖర్చు చేసినా నయం కాలేదు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న సమయంలో అతని భార్య వేరే వ్యక్తితో వెళ్లిపోయింది. దీంతో కొడుకు, మనవడి ఆలనా పాలన తల్లి రామవ్వ చూసుకుంటోంది. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబంలో 18 నెలలుగా మంచం పట్టిన మల్లేశ్‌కు తినడానికి తిండి కూడ లేని పరిస్థితి. ఈ క్రమంలో 'సాక్షి'లో వచ్చిన కథనం అందిరినీ కలచివేసింది. సాక్షి కథనం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడడంతో మల్లేశ్‌కు సాయం చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి దాతలు ముందుకు వచ్చారు.

అభాగ్యుడిని ఆదుకున్నారు..

మల్లేశ్ పరిస్థితి చూసిన గ్రామ యువత చలించిపోయారు. ఆపదలో ఉన్న మిత్రుడిని బతికించుకోవాలని వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన మార్కరి సతీశ్, దుల్లె దినేశ్, మార్కరి నవీన్, జాగీరు రాజేశ్‌గౌడ్, జాడి గంగాధర్, మోతే శేఖర్, ఎ.గంగాధర్, తదితర యువకులు గ్రామంతో పాటు విదేశాల నుంచి వివిధ రూ.లక్షా ఇరవైవేల వరకు పోగు చేశారు. 'జై జవాన్..జై కిసాన్ ఫౌండేషన్ సభ్యులు, పూర్వ యువసేన సభ్యులు, తదితరులు సాయం అందించారు.

అండగా నిలిచిన మంత్రి పీఏ

మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పీఏ కృష్ణంరాజు అండగా నిలిచారు. గత నెల 6న రూ.5 వేల నగదు, మూడునెలలకు సరిపడా నిత్యావసరాలు అందజేశారు. ఆపరేషన్‌కు లక్షా యాభైవేలు అవసరం కాగా దాతల ద్వారా రూ.లక్ష వరకు పోగయ్యాయి. మిగాతా రూ.50 వేలు, మందుల ఖర్చులను భరించేందుకు ముందుకు రావడంతో ఆపరేషన్ పూర్తయ్యింది.

'సాక్షి'కి రుణపడి ఉంటా

నాకు ఆపరేషన్ అవుతుందని కలలో కూడా ఊహించలేదు. ఏడాదిగా నన్ను ఎవరూ పట్టించుకోలేదు. అలాంటిది సాక్షి పేపర్‌లో వచ్చిన వార్తతో నాకు తెలియని ఎంతోమంది వారికి తోచిన సాయం అందించారు. ఇందుకు 'సాక్షి'కి రుణపడి ఉంటా. నా ఆపరేషన్‌కు సహకరించిన దాతలందరికీ కృతజ్ఞతలు.

– నాంపెల్లి మల్లేశ్

సామాజిక పరివర్తనకు కవి సమ్మేళనాలు

- మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే

ఆదిలాబాద్: సామాజిక పరివర్తనకు కవి సమ్మేళనాలు దోహదం చేస్తాయని అఖిల భారత మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీలోని బుద్ధ విహార్‌లో గురువారం ఏర్పాటు చేసిన బహుజన కవి సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు కవులు సామాజిక న్యాయాన్ని గురించి వినిపించిన కవితలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ, మహారాష్ట్రలోని కవులతో కవి సమ్మేళనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పూలే, సాహూ, అంబేడ్కర్ల వాదాన్ని బహుజనులంతా అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కవి సమ్మేళనంలో భాగంగా పూలే దంపతుల జీవిత చరిత్రపై వందన శంబాజీ ప్రదర్శించిన ఏకపాత్రాభినయం ప్రేక్షకులను అలరించింది. కార్యక్రమంలో ప్రముఖ కవులు మధుబావల్కర్, రిటైర్డ్ ఎస్బీఐ మేనేజర్ సోమాజీ, అశోక్, యూనిస్ అఖ్బాని, అనిల్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిని చంపిన తనయుడికి జీవిత ఖైదు

ఆదిలాబాద్‌టౌన్: తల్లిని చంపిన తనయుడికి జీవిత ఖైదుతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. జైనథ్ గ్రామానికి చెందిన రూపాని లసుంబాయికి నలుగురు సంతానం. వీరందరు వేర్వేరుగా జీవిస్తున్నారు. బాధితురాలు ఐదెకరాల పంట చేను కౌలుకు ఇచ్చి అదే గ్రామంలో ఒంటరిగా జీవిస్తోంది. పెద్ద కుమారుడు రూపాని నాందేవ్ కౌలు డబ్బులు ఇవ్వాలని తల్లితో తరచూ గొడవ పడేవాడు. 2020 మే 12న తాగిన మైకంలో తల్లితో గొడవపడగా ఆమె డబ్బులు ఇవ్వనని చెప్పింది. దీంతో భార్య దీపికను పిలిచి పెట్రోల్ తెమ్మని తల్లిపై పోసి నిప్పంటించాడు. అరుపులు విన్న స్థానికులు వచ్చి మంటలు ఆర్పివేశారు. రిమ్స్‌లో చేర్పించి చికిత్స అందించినా 2020 ఆగస్టు 3న ఇంట్లో మృతి చెందింది. మృతురాలి కూతురు శాంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు జైనథ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుడితో పాటు అతని భార్యపై కేసు నమోదు చేసి అప్పటి జైనథ్ సీఐ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. లసుంబాయి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న సమయంలో వాంగ్మూలనం తీసుకున్నారు. నేరస్తుడి భార్యపై నేరం రుజువు కానందున ఆమెను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. పీపీ 21 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో ఈ మేరకు జడ్జి శిక్ష విధించినట్లు వివరించారు.

లారీ కిందకు దూసుకెళ్లిన బైక్

- ఒకరికి తీవ్రగాయాలు



లారీ కిందకు దూసుకెళ్లిన బైక్

భైంసాటౌన్(ముథోల్): పట్టణంలోని శివాజీచౌక్‌లో ఎదురుగా వస్తున్న లారీ కిందకు బైక్ దూసుకెళ్లిన ఘటనలో ఒకరికి తీవ్రగాయాలు, కాగా మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. దిలావర్‌పూర్ మండలం కుప్టి గ్రామానికి చెందిన దత్తహరి, మోహన్ వ్యవసాయ పరికరం వెల్డింగ్ కోసం గురువారం ఉదయం భైంసాకు వచ్చారు. శివాజీచౌక్ మీదుగా పట్టణంలోకి వస్తుండగా కూడలి వద్ద ఎదురుగా వస్తున్న లారీ కిందకు దూసుకెళ్లారు. ఘటనలో బైక్ నడుపుతున్న దత్తహరికి చేతికి తీవ్రగాయాలు కాగా, మోహన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఆటోలో ఏరియాస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

చించోలి(బి) గుట్ట వద్ద మృతదేహం లభ్యం

సారంగపూర్(నిర్మల్): జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్‌కు చెందిన సయ్యద్ ఇర్ఫాన్(26) మృతదేహం గురువారం చించోలి(బి) రిజర్వు ఫారెస్ట్ గుట్టవద్ద లభ్యమైనట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. పశువులు మేపేందుకు వెళ్లిన కాపరులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్‌వాసిదిగా గుర్తించారు. నిర్మల్ పట్టణ పోలీసులతో పాటు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు ఈ నెల 2న ఇంట్లో భార్యతో గొడవపడి బయటకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పటి నుంచి వెతుకుతున్నా ఆచూకీ లభించలేదన్నారు. కాగా అప్పటికే మృతదేహం కుళ్లిపోయింది. వైద్యాధికారి వేణుగోపాల కృష్ణ శవపంచనామా నిర్వహించారు. మృతునికి భార్య శభాన ఉన్నారు. మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని అందవెల్లి పెద్ద వాగు వద్ద గల్లంతైన వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. బుధవారం దహెగాం మండలం దేవాజీగూడ గ్రామానికి చెందిన ఇడిదినేని మల్లయ్య (65) అందవెల్లి పెద్దవాగు తాత్కాలిక వంతెన వద్ద వాగు దాటుతుండగా నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో కొట్టుకుపోయారు. ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ ఆధ్వర్యంలో ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా బోడపల్లి శివారులో మృతదేహం లభ్యమైంది. మృతునికి భార్య దుర్గక్క, కుమారుడు శ్రీనివాస్ ఉన్నారు.

ముందు బిల్లులివ్వండి.. తర్వాతే విద్యార్థులొస్తారు

- ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ పీవోతో హెచ్‌ఎం
- పాఠశాలను తనిఖీ చేసిన చాహత్ బాజ్‌పాయ్



తనిఖీ నిర్వహిస్తున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

పెంచికల్‌పేట్(సిర్పూర్): ఆశ్రమ పాఠశాల తనిఖీకి వచ్చిన ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌కు అనుకోని సంఘటన ఎదురైంది. గురువారం పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్ ఆశ్రమోన్నత పాఠశాలలో పీవో తనిఖీకి వచ్చిన సమయంలో ఒక్క విద్యార్థి కూడా లేక పోవడంతో ప్రధానోపాధ్యాయుడు అశోక్ కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలు ప్రారంభమై 20 రోజులు కావస్తున్నా విద్యార్థులు రాకపోవడంపై నిలదీశారు. విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. మరో నాలుగు రోజుల్లో తిరిగి తనిఖీ నిర్వహిస్తామని పరిస్థితి మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ముందుగా విద్యార్థుల భోజన బిల్లులు ఇవ్వాండి.. ఆ తర్వాతే విద్యార్థులు వస్తారని అన్నాడు. గతేడాది 8 నెలల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఈసారి గుత్తేదారు ఇంకా భోజన సరుకులు సరఫరా చేయలేదన్నాడు. స్పందించిన పీవో ప్రస్తుతం భోజనానికి సంబంధించి బిల్లులను సంబంధిత ప్రధానోపాధ్యాయులే భరించాలన్నారు. నివేదిక పంపిస్తే ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందన్నారు.

విద్యార్థులకు సర్దిచెప్పి బోధన అందించాలి

బెజ్జూర్: విద్యార్థులకు సర్దిచెప్పి బోధన అందించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బెజ్జూర్ మండలంలోని కుంటలమానేపల్లి, సలుగుపల్లి, బెజ్జూర్ ఆశ్రమ పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను ఇంటికి పంపవద్దని, త్వరలో ఆశ్రమ పాఠశాలలకు నిత్యావసర వస్తువులు అందజేస్తామన్నారు. ఆమె వెంట ఎంపీడీవో మాధవి, ఎంపీవో రమేశ్‌రెడ్డి, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పార్థిరామ్ ఉన్నారు. అనంతరం కాగజ్‌నగర్ మండలంలోని జంబుగా హెచ్ఎన్‌టీసీ నర్సరీని పరిశీలించారు.

మద్యం దుకాణంలో చోరీ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీవల్లి వైన్స్ దుకాణంలో చోరీ జరిగింది. దుకాణం నిర్వాహకుడు రెబ్బెన సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి రోజువారీగా మద్యం అమ్మకాలు ముగించుకుని దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయారు. ఉదయం వచ్చి షెట్టర్ తెరిచి చూడగా దుకాణం పైకప్పు రేకులు తొలగించి ఉండడం గమనించారు. దుకాణంలో పరిశీలించగా సుమారు రూ.25 వేల నగదు, రూ.23 వేల విలువైన మద్యం బాటిళ్ల చోరీకి గురైనట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వాంకిడి: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. జైనూర్ మండలంలోని పొలాసకు చెందిన లాల్ ఖాన్ ఆసిఫాబాద్ నుంచి వాంకిడి వైపు తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి కిందపడ్డాడు. దీంతో అతనికి గాయాలయ్యాయి. ఎస్సై సాగర్ క్షతగాత్రుడిని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సర్వీస్ వైరే యమపాశమైంది...

- విద్యుత్ షాక్‌తో యువకుడు, రెండు గేదెలు మృతి
- సర్వీస్ వైర్ ఇన్సులేషన్ ఫెయిల్ కావడంతో ఘటన



రమాకాంత్ (ఫైల్)



మృతి చెందిన గేదెలు

రెబ్బెన(ఆసిఫాబాద్): వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించే ఇంటి పెద్ద దిక్కును విద్యుత్ సర్వీసు వైరు రూపంలో మృత్యువు పొట్టనపెట్టుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రెబ్బెన మండలం కైరిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లగూడకు చెందిన జిట్టవేణి రమాకాంత్ (30)గురువారం పశువుల కాపరి రాకపోవడంతో తానే గేదెలను మేపేందుకు వెళ్లాడు. సాయంత్రం గేదెలను తోలుకుని వచ్చి ఇంటిముందున్న షెడ్డు లోపలికి తోలాడు. లోపలికి వెళ్లిన గేదెలు పెద్దగా అరవడంతో లోనికి వెళ్లి అరుస్తున్న గేదెలపై చేయి వేశాడు. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు రెబ్బెన పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై భూమేష్ తెలిపారు.

సర్వీస్ వైర్ ఇన్సులేషన్ ఫెయిల్ కావడంతోనే ప్రమాదం

ఇంటికి సరఫరా చేసే విద్యుత్ సర్వీస్ వైర్ ఇన్సులేషన్ ఫెయిల్ కావడంతోనే ప్రమాదం సంభవించి రెండు గేదెలు, వ్యక్తి మృతి చెందాడని విద్యుత్ శాఖ ఏఈ ఇమ్రాన్ తెలిపారు. స్తంభం నుంచి మీటర్‌కు సరఫరా చేసే సర్వీస్ వైరు రమాకాంత్ ఇంటి ముందు ఉన్న రేకులషెడ్డుపై నుంచి వెళ్తుంది. సర్వీస్ వైరు ఇన్సులేషన్ ఫెయిల్ అయి తీగ తెగి రేకుల షెడ్డుకు తాకడంతో షెడ్డంతా విద్యుత్ సరఫరా అయినట్లు విద్యుత్‌శాఖ సిబ్బంది గుర్తించారు.

గర్భిణులకు స్కానింగ్ కష్టాలు



జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు స్కానింగ్ కష్టాలు తప్పడం లేదు. రోజుకు 150కు పైగా గర్భిణులు వైద్యపరీక్షల కోసం వస్తుండగా స్కానింగ్ కోసం ఇద్దరు రేడియాలజిస్టులను నియమించారు. ఉదయం 9 గంటలకు ఓపీ సేవలు ప్రారంభంకాగా వారు ప్రైవేటు స్కానింగ్ కేంద్రాల్లో పనిచేసి మధ్యాహ్నం 12 గంటల తర్వాత వస్తుండడంతో గర్భిణులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

– మంచిర్యాలటౌన్

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో గేదె మృతి

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్‌లో గురువారం బొజ్జ పోశెట్టికి చెందిన గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. గ్రామ శివారులోకి మేతకు వెళ్లిన గేదె పొలం వద్ద విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే చనిపోయింది. దీని విలువ రూ.50వేలు ఉంటుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

రాయితీపై కంది విత్తనాలు

పెంబి: జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా పప్పు దినుసుల సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో రైతులకు నాణ్యమైన కంది విత్తనాలను ప్రభుత్వం వందశాతం రాయితీపై అందిస్తుందని ఏఈవో రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావాల్సిన వారు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్సులతో పెంబి వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పోచమ్మకు సారె సమర్పణ



పోచమ్మకు సారె సమర్పిస్తున్న మహిళలు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ముత్యాల పోచమ్మ ఆలయంలో గురువారం ఆర్యవైశ్య సంఘం మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. మనసారా మనసారె -మన అమ్మకు కార్యక్రమంలో భాగంగా శ్రీశైవ క్షేత్ర వనితాశక్తి ఖానాపూర్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్చకులు రాజశేఖర్ శర్మ, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు జితేందర్, కమిటీ సభ్యులు గోలి మాధవి, కట్కం గీత, వాసవి, రాధిక, నీలిమ, మానస, స్రవంతి, లక్ష్మి, శ్వేత తదితరులు ఉన్నారు.

కేజీబీవీలో వైద్యపరీక్షలు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని కేజీబీవీలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పీ హెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మందులు అందజేశారు. సర్పంచ్ ముత్యం రెడ్డి, కార్యదర్శి విక్రమ్, ఎస్‌వో నవిత, సుగుణ తదితరులు ఉన్నారు.

బహుజనులు ఏకం కావాలి

కడెం: బహుజనులంతా ఏకమై వచ్చే ఎన్నికల్లో బీఎస్పీని గెలిపించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్ చవాన్ అన్నారు. గురువారం కడెంలోని హరిత రిసార్ట్స్‌లో పార్టీ నియోజకవర్గ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయగా వారు హాజరై మాట్లాడారు. మండల, బూత్ కమిటీలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజు, బన్సీలాల్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

పాఠశాలలో ఆషాఢ బోనాలు



బోనాల వద్ద విద్యార్థినులు

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ అక్షర ఉన్నత పాఠశాలలో గురువారం ఆషాఢ బోనాల పండుగ నిర్వహించారు. విద్యార్థినులు బోనం వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా బోనాల విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. పాఠశాల చైర్మన్ నరేశ్‌రెడ్డి, సభ్యులు నవీన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

కొత్త రుణాలు మంజూరు చేయాలి

కుంటాల: స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థిక ప్రగతి సాధించేలా వారికి కొత్త రుణాలు మంజూరు చేయాలని డీపీఎం వెంకటసాయి ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సీసీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అవసరం ఉన్న వారికి వ్యవసాయ, విద్య, పాడి, ఉద్యోగాల కోసం రుణాలివ్వాలన్నారు. తీసుకున్న రుణాలను సైతం ఎప్పటికప్పుడు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీఎం భోజన్న, సీసీలు పెంటన్న, యూసుఫ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న పంచాయతీ కార్యాలయం



భైంసారూరల్: మండలంలోని లింగా గ్రామంలో వర్షపునీరంతా ఇళ్ల ముందు చేరింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో గ్రామం చిన్నపాటి చెరువును తలపిస్తోంది. గురువారం పంచాయతీ కార్యాలయం చుట్టూ వరద చేరడంతో కార్యాలయంలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

అడ్డగోలుగా తవ్వుతున్నరు?

- చెరువుల్లో ఇష్టారీతిన మొరం, నల్లమట్టి తవ్వకాలు
- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- ఎక్కడ చూసినా గుంతలే..
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు, మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు



సారంగపూర్ అంబవాయి చెరువులో గుంతలు



జామ్‌లో నాగమ్మ చెరువు వద్ద మొరం తరలించడంతో ఏర్పడిన గుంతలు

సారంగపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న చెరువుల్లో మొరం, నల్లమట్టి తవ్వకాలు జోరందుకున్నాయి. రైతులు తమ పొలాలకు నల్లమట్టిని తరలించే క్రమంలో ట్రాక్టర్లు, జేసీబీల యజమానులు క్రమపద్ధతిలో కాకుండా ఇష్టారీతిన అడ్డగోలుగా తవ్వకాలు జరిపారు. దీంతో చెరువు మధ్యలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు కురిసి చెరువులు నిండుకున్న తర్వాత గుంతలు కన్పించక పశువులు, ప్రజలు వాటిల్లో పడిపోయే ప్రమాదం ఉంది.

సారంగపూర్ మండలంలో..

సారంగపూర్ మండలంలో మొత్తం 18 చెరువులు, స్వర్ణ, ధోనిగాం ప్రాజెక్టులు ఉన్నాయి. ఏటా వర్షాకాలం ఆరంభంలో రైతులు తమ పొలాలకు చెరువుల్లోంచి నల్లమట్టిని భూసారం పెంచేందుకు తరలిస్తారు. సాధారణంగా ఒక క్రమపద్ధతిలో మట్టి తవ్వకాలు జరిపితే చెరువులోతుతోపాటు నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. కానీ ట్రాక్టర్లు, పొక్లెయిన్ల యజమానులు మాత్రం ఇష్టానుసారం తవ్వి మట్టి తరలించడంతో గుంతలు ఏర్పడ్డాయి.

అనుమతుల్లేకుండానే..

చెరువులో నీరు ఎండిపోతున్న క్రమంలో కొందరు అక్రమార్కులు మొరం తవ్వకాలు జరిపి.. మహారాష్ట్ర సరిహద్దులు దాటిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తవ్వకాలతో చెరువుల మధ్యలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి.

రెండేళ్ల కిందట సారంగపూర్ మండలంలోని జామ్ గ్రామానికి చెందిన కరిపె శంకర్ భార్య లక్ష్మి ప్రమాదవశాత్తు నాగమ్మ చెరువు గుంతలో పడిపోయి మృతి చెందింది.

శిఖం భూములపైనా కన్ను..

చెరువుల సమీపంలో పట్టా భూములున్న రైతులు చెరువు శిఖం భూములపై కన్నేశారు. శిఖం భూములను ఏకంగా మొరం తవ్వకాలు జరిపి నేలను చదును చేస్తూ తమ చేన్లలో కలిపేసుకుంటున్నారు. మండలంలోని జామ్ మోర్ చెరువు శిఖం భూములను.. సారంగపూర్‌లోని అంబవాయి చెరువుతోపాటు స్వర్ణ ప్రాజెక్టు శిఖం భూములు సైతం ఆక్రమణకు గురవుతున్నాయి. ఇదంతా బాహటంగానే జరుగుతున్నా అటు రెవెన్యూ అధికారులు గాని, మైనింగ్ అధికారులు గాని పట్టించుకోనట్లు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికే స్వర్ణ ప్రాజెక్టు దిగువన భూములను కొన్నేళ్లుగా సాగు చేస్తున్నా.. ఖాళీ స్థలాల్లో నిర్మాణాలు చేపడుతున్నా ఎవరూ స్పందించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహిస్తున్నారు.

గుంతలో పడి చనిపోయాడు



గతేడాది మా మామ లక్ష్మారెడ్డి వాగు దాటి అవతలి వైపున్న పొలానికి వెళ్తూ ఇసుక కోసం తవ్విన గుంతలో పడి చనిపోయాడు. చెరువులు, వాగుల్లో నిబంధనల ప్రకారం తవ్వకాలు జరపాలి. ఇష్టారీతిన తవ్వకాలు జరిపితే పెద్ద ప్రమాదాలు జరుగుతాయి.

– సత్యపాల్‌రెడ్డి, యాకర్‌పెల్లి

చర్యలు తీసుకుంటాం..

శిఖం భూములను ఆక్రమిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవు. అలాగే అక్రమంగా మొరం తరలించే వారిపై చర్యలు తీసుకుంటాం. తక్షణమే ఎంఆర్‌ఐ, సర్వేయర్‌తో చెరువులను పరిశీలించి శిఖం ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – సంతోష్‌రెడ్డి, తహసీల్దార్

అధికారులు స్పందించి తక్షణం చర్యలు తీసుకుని చెరువుల్లో అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేసి శిఖం భూములను పరిరక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అన్నివర్గాల అభివృద్ధే ధ్యేయం

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



గన్నోరాలో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ముధోల్: అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. గన్నోరాలో రూ.2.5లక్షలతో హనుమాన్ ఆలయం, రీడింగ్‌రూం, రువ్వి గ్రామంలో రూ.లక్షతో కోనేరు పోచమ్మ ఆలయం, రూ.2.5లక్షలతో యాదవ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, రైతుబంధు సమితి అధ్యక్షుడు రాంరెడ్డి, సర్పంచ్‌లు లాలాబాయి, రాజన్న, లావణ్య, రాంచందర్, రూప విఠల్‌రెడ్డి, విజేష్, ఎంపీటీసీ లక్ష్మీ నారాయణ, మాజీ జెడ్పీటీసీ గంగాధర్, సురేందర్‌రెడ్డి, రాములు, పీరుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం



నూతన మండలాధ్యక్షులతో వెడ్మబొజ్జు

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జు

ఖానాపూర్: రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం వారికి అన్యాయం చేస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాల్‌లో పార్టీ నియోజకవర్గ ముఖ్య నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖానాపూర్, కడెం మండలాలకు సాగునీటిని అందించే సదర్మాట్‌కు ప్రత్యేక కాలువ ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ అమలు చేయలేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే రేఖానాయక్ వైఫల్యం కారణంగా ఖానాపూర్ మండలంలో చేపట్టాల్సిన బ్యారేజీ నిర్మాణం నిర్మల్ నియోజకవర్గానికి వెళ్లిపోయిందన్నారు. కడెం ప్రాజెక్టు ఎత్తు పెంచడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైస్‌మిల్లులు, ట్రాక్టర్ షోరూంలు, ప్రైవేట్ కళాశాలల ద్వారా ధనార్జనే ధ్యేయంగా ఎమ్మెల్యే పని చేస్తున్నారన్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయించడంలో కూడా ఎమ్మెల్యే విఫలమయ్యారని అన్నారు. పట్టణంలో పెరిగిన అవినీతితోపాటు అభివృద్ధి కుంటుపడడంతో కౌన్సిలర్లంతా అవిశ్వాసం పెడితే దానిని అడ్డుకునేందుకు ఎమ్మెల్యే యత్నిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే భర్త చేసిన అవినీతి, అక్రమాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే ముందస్తుగా ఉద్యోగానికి రాజీనామా చేశారని ఆరోపించారు.

మండలాలకు అధ్యక్షుల ఎన్నిక..

నియోజకవర్గంలోని మండలాలు, పలు పట్టణాల అధ్యక్షులను పార్టీ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఖానాపూర్ మండల అధ్యక్షుడిగా దయానంద్, పట్టణ అధ్యక్షుడిగా నిమ్మల రమేష్, పెంబి మండల అధ్యక్షుడిగా స్వప్నిల్‌రెడ్డి, దస్తూరాబాద్ మండల అధ్యక్షుడిగా దుర్గం మల్లేశ్, జన్నారం మండల అధ్యక్షుడిగా ముజఫర్ అలీఖాన్, జన్నారం పట్టణ అధ్యక్షుడిగా దుమ్మల్ రమేశ్, ఇంద్రవెల్లి మండల అధ్యక్షుడిగా ముకడే ఉత్తం, ఇంద్రవెల్లి పట్టణ అధ్యక్షుడిగా ఎండీ.జహీర్, ఉట్నూర్ మండల అధ్యక్షుడిగా అబ్దుల్ ఖయ్యూం, ఉట్నూర్ పట్టణ అధ్యక్షుడిగా బొమ్మల భూమేశ్, కడెం మండల అధ్యక్షుడిగా తుమ్మల మల్లేశ్‌యాదవ్ ఎన్నికయ్యారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు చిన్నం సత్యం, యూసుఫ్‌ఖాన్, షబ్బీర్‌పాషా, దుర్గాభవాని, కడార్ల గంగనర్సయ్య, గుగ్లావత్ రాజునాయక్, తోట సత్యం, జహీర్ హైమద్, వాజిద్ ఖాన్, నాగరాజు, రాసమల్ల అశోక్, మైస శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే రేఖానాయక్



దస్తురాబాద్‌లో పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

దస్తురాబాద్: గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో 426 మంది గిరిజనులకు 884 ఎకరాలకు సంబంధించిన పోడు భూముల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అంతకుముందు మండలంలోని దేవునిగూడెం నుంచి భూత్కూర్ గ్రామం వరకు రూ.రెండు కోట్లతో చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సింగరి కిషన్, జెడ్పీటీసీ శారద, వైస్ ఎంపీపీ రాజునాయక్, సర్పంచ్ రాజమణి, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, సర్పంచులు సురేశ్ నాయక్, భూమేశ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఐలయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాల్‌లో గురువారం మండలానికి చెందిన 382 మంది రైతులకు 1157 ఎకరాలకు సంబంధించిన పోడు భూముల హక్కు పత్రాలను ఎమ్మెల్యే రేఖానాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. హక్కు పత్రాలు పొందిన వారికి పంటరుణాలు, రైతుబంధు వంటి అన్ని సబ్సిడీలు వర్తిస్తాయని పేర్కొన్నారు. ఎంపీపీ మోహిద్, వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, తహసీ ల్దార్ రాజమోహన్, ఎంపీడీవో మల్లేశ్, ప్రజాప్రతినిధులు, శంకర్, శ్రీనివాస్, పుప్పాల స్వ ప్న, రాజగంగన్న, ప్రదీప్, రామయ్య, మల్లయ్య, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

పోడు సాగుదారులందరికీ పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న నంది రామయ్య

ఖానాపూర్: పోడు సర్వే జాబితాలో పేర్లు ఉండి తొలగించబడిన పోడు సాగుదారులందరికీ ప్రభుత్వం పోడు హక్కుపత్రాలను పంపిణీ చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి నంది రామయ్య అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్ అండ్‌బీ విశ్రాంతి భవనంలో పోడు సాగుదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దశాబ్దాల పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం దిగివచ్చి పోడు సాగుదారులకు హక్కు పత్రాలు అందిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వేలో 11 లక్షల 50వేల ఎకరాలను గుర్తించిన ప్రభుత్వం కేవలం నాలుగు లక్షల ఎకరాలకే హక్కుపత్రాలను పంపిణీ చేస్తుందన్నారు. అనంతరం పోడు హక్కు పత్రాలు పొందిన పలువురు సాగుదారులు నంది రామయ్యకు మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో రాజన్న, అంకుశ్‌రావు తదితరులు ఉన్నారు.

వ్యవసాయ కూలీల రేట్లు పెంచాలి

లోకేశ్వరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కూలీల రేట్లను పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కూలీ రేట్లకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆడవారికి కూలీ కింద రోజుకు రూ.250కి మించి, పురుషులకు రూ.500లు దాటడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారి కూలీ రూ.600లకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గైని మురళీమోహన్, మండలాధ్యక్షుడు తిమ్మపూరం ముత్తన్న, కార్యదర్శి దేవేందర్, ఉపాధ్యక్షుడు నవీన్ ఉన్నారు.

పారిశుధ్య సమస్యలు రానివ్వం



కాలువ పరిశీలిస్తున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌చైన్‌గేట్: వర్షాకాల నేపథ్యంలో పట్టణంలో పారిశుధ్య సమస్యలు రానివ్వకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్ ప్రాంతంలో భారీ మురుగు నీటి నాలాలను గురువారం ఆయన పరిశీలించారు. నాలాల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ అడ్డు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. శివాజీచౌక్‌లో ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా భైంసా స్టాప్ మారుస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజు, ఏఈ హరిభువన్, ట్రాఫిక్ ఎస్సై దేవేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు ముజాయిద్ చోస్, సిబ్బంది ఉన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్ గ్రామంలో పారిశుధ్య పనులను ఎంపీవో రహీం పరిశీలించారు. రోడ్డుపై నీరు నిల్వకుండా, మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యదర్శి శ్రావణ్ తదితరులున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

భైంసాటౌన్: వ్యాధుల పట్ల అవగాహనతో ఉండి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఆరోగ్య భారతి క్షేత్ర సంఘటన మంత్రి కుమారస్వామి అన్నారు. పట్టణంలోని గురుకృపా వొకేషనల్ జూనియర్ కళాశాలలో గురువారం ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు యోగా, గృహవైద్యం, ప్రథమ చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర సభ్యులు రామకృష్ణాగౌడ్, ప్రాంత కార్యదర్శి రమేశ్‌గౌడ్, జిల్లా సంయోజక్ చిన్నన్న, ప్రిన్సిపాల్ సాయినాథ్ తదితరులున్నారు.

స్థానికుల నిరసన

భైంసా: ఇటీవల కురిసిన వర్షాలతో బాసర పంచాయతీలోని 13వ వార్డు పరిధి శారదనగర్‌లో ప్రధాన రోడ్డుపై నీరు నిలిచి బురదగా మారింది. దీంతో గురువారం కాలనీవాసులు నిరసన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న బాసర సర్పంచ్ లక్ష్మణ్‌రావు వెంటనే టిప్పర్లతో మొరం తెప్పించి నీరు నిలిచిన ప్రాంతంలో పోయించారు. దీంతో సమస్య పరిష్కారమైంది.

మొక్కలు నాటి సంరక్షించాలి

తానూరు: హరితహారంలో భాగంగా మండలంలోని దాగాం గ్రామంలో గురువారం ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సేవలు వెలకట్టలేనివి

లక్ష్మణచాంద: వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు వెలకట్ట లేనివని డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వడ్యాల్ రైతువేదికలో ఆ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. సంస్థ జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మన్న, కేశం రమేశ్, ఏఈవో సంతోశ్, గోవర్ధన్, సభ్యులు పాల్గొన్నారు.

ఓపీఎస్ సాధనకు అంతిమ పోరాటం

నర్సాపూర్(జి): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులంతా సంఘటితంగా పోరాడి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) సాధించేందుకు అంతిమ పోరాటం చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు పిలుపునిచ్చారు. మండలంలోని గొల్లమాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బూరుగుపల్లి(జి) ప్రాథమిక పాఠశాలల్లో గురువారం సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఎస్ రద్దు కోసం చేపట్టిన సంకల్ప రథయాత్ర ఈనెల 24న జిల్లా కేంద్రంలో సాగుతుందని ఉద్యోగులు భారీగా హాజరు కావాలని కోరారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, దాసరి రమేశ్, ప్రవీణ్, రఫీ, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన



లోకేశ్వరంలో బోనాలతో భక్తులు

లోకేశ్వరం: మండల కేంద్రంలో ఐదురోజులుగా జరుగుతున్న పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన గురువారం ముగిసింది. గురువారం పెద్దమ్మతల్లి కల్యాణం వేద పండితులు చంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించగా భక్తులు తరలివచ్చారు. బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామారావు పటేల్, నాయకులు పూజలు చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

దస్తురాబాద్: తమ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె నోటీసును ఎంపీవో అనిల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేసి నెలకు రూ.19500 వేతనం చెల్లించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. మల్టీపర్పస్ కార్మికుల సంఘం మండలాధ్యక్షుడు పోతు శ్రీనివాస్, రామన్న, విజయ్, నర్సయ్య, రాజేందర్, గంగన్న, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతు..

పెంబి: గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి వారికి కనీస వేతనం రూ.19వేలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంచికంటి డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులకు ఆయన మద్దతు తెలిపారు. అనంతరం ఎంపీవో రత్నాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లింగన్న, మల్లేష్, అనిల్, జగన్నాథం, రాజు, నర్సవ్వ, సోనేరావ్, పెద్దులు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

బాబా ఆలయంలో భక్తుల సందడి

కుంటాల: మండలంలోని కల్లూర్ శ్రీ దత్తవెంకట సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. వివిధ గ్రామాల భక్తులు ఆలయానికి చేరుకొని బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

శుభ్రతపై అవగాహన కల్పించాలి

కుంటాల: గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడకుండా పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని వైద్యురాలు శృతిరెడ్డి సూచించారు. గురువారం కుంటాల రైతువేదికలో ఆశా, అంగన్‌వాడీ, కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. డీఎల్‌పీవో శివకృష్ణ ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, వైద్యులు అమృత, దేవేందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలపై భారం'

లోకేశ్వరం: బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పడుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని పుస్పూర్ గ్రామాల్లో పల్లెపల్లెకు బీజేపీ గడప గడపకూ మోహన్‌రావు పటేల్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. సుభాశ్‌పటేల్, లిగాల పోతన్న, నరహరి, అనిల్, భూమన్న ఉన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

కడెం: గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు సతీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కొండుకూర్ గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండలాల అధ్యక్షులను సన్మానించారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, మాజీ వైస్‌ఎంపీపీ సంతోష్‌రెడ్డి, పెందూర్ ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

మిద్దెచింతలో అకాడి పూజలు

కడెం: మండలంలోని ఉడుంపూర్ జీపీ పరిధిలోని మిద్దెచింత గ్రామంలో గురువారం గ్రామస్తులు అకాడి పూజలను ప్రారంభించారు.ఏత్మాసూర్ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. దీపావళి పండుగ వరకు రోజు పూజలు చేస్తామని గ్రామస్తులు పేర్కొన్నారు.